రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ 24వ విడత నిధులు

3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ

3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 307 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 31 అక్టోబర్ 2026


# మియాపూర్ భూములను విక్రయిస్తాం!

- రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే.. సుప్రీంకోర్టు తీర్పుపై సీఎం హర్షం
- భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులు నీటిపారుదల, విద్యా, వైద్య రంగాలకు
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మియాపూర్‌లో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికి చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయ స్థానానికి ధన్యవాదాలు తెలిపారు. మియాపూర్ భూములను విక్రయించి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నీటిపారుదల, విద్యా, వైద్య తదితర కీలక రంగాలకు ఈ నిధులను కేటాయిస్తామని వెల్లడించారు. శుక్రవారం ఢిల్లీలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులతో

కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఈ వివరాలు వెల్లడించారు.మియాపూర్ భూముల విక్రయంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రేవంత్‌రెడ్డి మిగతా2లో...

## ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

- 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రతకు ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబానికి మిగతా2లో...

## జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

- ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ
- ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు తాత్కాలిక మినహాయింపు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఎన్నికలు జరగనున్న మిగతా2లో...

## పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

- ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు

**అమరావతి,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**తీర ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం సీడీఎంఏ సంపత్‌కుమార్, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా2లో...

## మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

- సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేశాం
- భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించిన హరీశ్‌రావు

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో మిగతా2లో...

## హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

- తెలంగాణకు ప్రకటించిన మూడు కారిడార్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి
- కొత్త రైల్వే మార్గాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అనంతారంలో మెగా ఫ్రైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి

2లో



## సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా
- రూ.1,10,250 బోనస్
- నవంబర్ 5న బ్యాంకు ఖాతాల్లో జమ.. భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి కార్మికు లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. నవం బర్ 5న కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి గరిష్టంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం 38 వేల మందికి రూ.419 కోట్లు చెల్లించనున్నారు.ఇప్పటికే దసరా లాభాల వాటా కింద రూ.600 కోట్లు చెల్లించగా, మిగతా2లో...

## ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

- రైతులు, యువత, ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం
- పంటలు వేయొద్దన్న సీఎం అధికారంలో ఉండొద్దు
- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ఇంద్రవెల్లి,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు మేలు చేసేందుకే కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆదివాసీల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీటి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.జిల్లాలోని 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా మిగతా2లో...

# హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. హైదరా బాద్ పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు తెలిపారు. కేంద్రం త్వరగా మార్గాల అమరికను ఖరారు చేస్తే భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై తెలంగాణకు అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న సుమారు 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డు పక్కనే ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా మార్గాన్ని ఖరారు చేయాలని సీఎం కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తి మాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ (8 కి.మీ.) రైల్వే మార్గాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన మెగా కోచింగ్, సరుకు రవాణా నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో కోసం అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ భూములను విక్రయిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, వాటి ద్వారా వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు వాటిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.మియాపూర్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విలువైన భూములను ఆక్రమించేందుకు గత బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని తెలిపారు.

కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ, మంచిరేవుల ప్రాంతాల్లోని భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. గుర్రంగూడలోని భూములు అటవీ భూములేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కూడా పరిరక్షించినట్లు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనూ ప్రభుత్వ, అటవీ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసినట్లు సీఎం పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ భూముల వ్యవహారాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ అంశాలపై శాసనసభలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూముల విషయంలో ఇకనైనా వివాదాలు సృష్టించకుండా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

లేవని, ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. రైతులకు నీరు, విద్యుత్, యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పంటలు వేయొద్దని సూచిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు.తమ పార్టీ పాంచజన్య పేరుతో ఐదు ప్రధాన అంశాలను లక్ష్యంగా పెట్టుకుందని కవిత తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తామని, యువతకు రుణాలు కల్పించి ఆర్థికంగా ఎదిగేలా తోడ్పడతామని హామీ ఇచ్చారు. రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించి వారి గౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ఆదిలాబాద్‌లో రైతు గర్జన సభ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా గతంలో తాము చేసిన పనులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సభకు ముందు ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద కుమురం భీం, కుమురం సూరు, రాంజీ గోండు, వన్నెల ఎల్లన్న, వెడ్మ రాములకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు, మాజీ మంత్రి బోడ జనార్ధన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు**

**రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం**

**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయ రంగానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకొస్తున్నామని వివరించారు.ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, రబీ పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సర్పంచ్ బండి భగవాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి

**తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు**

**అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ఎలా జరుగుతోందో, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలేమిటో అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటరుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాశ్, అల్వాల్ తహశీల్దార్ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రస్తుతం జనగణన నుంచి మినహాయింపు ఇచ్చింది. లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లోనూ ఈ షెడ్యూల్ వర్తించదు.జనగణనలో భాగంగా 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మినహాయింపు పొందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు సంబంధించిన తేదీలను తరువాత ప్రకటించనున్నారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని పునేఠా స్పష్టం చేశారు.ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్య, భద్రతా ఏర్పాట్లు, కేంద్రం వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున సూచించారు.ఒక్క బ్యాలెట్ పేపర్ కూడా గల్లంతు కాకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్‌లకు సుమారు 100 మీటర్ల దూరంలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా మీడియా ప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి కదలికను రికార్డు చేయాలని ఐజీ బి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు సిబ్బంది సైతం ప్రిసైడింగ్ అధికారి అనుమతితోనే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

(మొదటి పేజీ తరువాయి)

తాజా బోనస్‌తో కలిపి ఒకే నెలలో కార్మికులకు అందుతున్న మొత్తం రూ.1,020 కోట్లకు చేరనుంది. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ బోనస్ జాతీయ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన వారు అర్హులు. నిర్ణీత పనిదినాలు పూర్తి చేసిన వారికి పూర్తి బోనస్, అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి పని చేసిన కాలానికి అనుగుణంగా బోనస్ చెల్లించనున్నారు.

# ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో అధికారులకు శిక్షణనిచ్చే సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు, పనితీరు మెరుగుపడినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు. హైదరాబాద్‌లో సాంకేతిక పరిజ్ఞానం, జీవశాస్త్ర పరిశోధనలు, ఆధునిక సేవారంగాలు సాధించిన ప్రగతి రాష్ట్రానికి గొప్ప అవకాశమని భట్టి తెలిపారు. ఈ అభివృద్ధి నగరానికే పరిమితం కాకుండా తయారీ, వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక రంగాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. యువత ఉపాధి కోసం హైదరాబాద్‌కు మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత జిల్లాల్లోనే మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

# మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయపోరాటం చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి ప్రభుత్వానికి అనుకూలంగా వాదనలు వినిపించేలా చేశామని పేర్కొన్నారు.2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసును నిరంతరం కొనసాగించిందని హరీశ్‌రావు వివరించారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాల సమర్పణలో తమ ప్రభుత్వ పాత్ర కీలకమని చెప్పారు. 2023 జూన్ 15న ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో వచ్చిన తీర్పు కూడా మియాపూర్ భూముల కేసుకు బలమైన న్యాయపునాది వేసిందన్నారు.సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని హరీశ్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వ కృషికి ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. సుమారు రూ.60 వేల కోట్ల విలువైన 550 ఎకరాల భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

# గ్రామ పంచాయతీలకు ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

**• గ్రామాల వారీగా వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుత ఏడాదికి ప్రత్యేక కార్యాచరణతో పాటు రానున్న మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామాల వారీగా జనాభా, పశువులు, పంటలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాల నమోదు నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ 24వ విడత నిధులు

**ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు**

**రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం: బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి**

**ఆత్మకూరు,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 24వ విడత నిధులను రైతుల ఖాతాల్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆత్మకూరు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు రైతు వేదికలో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం బీజేపీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణుగౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సండ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి బయ్యా పైడి, ఆచార్య రవ్వ శివప్రసాద్, జిల్లా నాయకులు మామునూరు శ్రీనివాస్, ఉగా సాయికృష్ణ, మండల నాయకులు జక్కుల మహేందర్, వజ్ర రవికుమార్, వంగాల బుచ్చిరెడ్డి, దుంపాల జైపాల్ రెడ్డి, బూత్ అధ్యక్షులు పోగుల యాదగిరి, అల్లి మహేందర్, బలభద్ర కైలాసపతి, దినేష్, సాయిరాం, రత్నాకర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల జీవితాలకు భరోసా ఏదీ?

**ప్రజారోగ్యానికి వెన్నెముకగా నిలుస్తున్న ఎన్హెచ్ఎం సిబ్బందికి న్యాయం చేయాలి..**

**18వ రోజు దీక్షకు న్యాయవాదుల సంఘీభావం**

**హనుమకొండ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల ప్రాణాలను కాపాడే ఆరోగ్య సేవల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీవితాలే అభద్రతలో కొనసాగడం ఆందోళనకరమని బహుజన న్యాయవాదుల ఫోరం స్టేట్ కన్వీనర్ గంధం శివ అన్నారు. ప్రభుత్వ వైద్య సేవలకు తమ శ్రమను అందిస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న నిరసన దీక్ష శుక్రవారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్య రంగంలో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్రను విస్మరించలేమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వివిధ ప్రజారోగ్య కార్యక్రమాల వరకు క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ ప్రభుత్వ వైద్య వ్యవస్థకు వీరు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో రాత్రింబవళ్లు కష్టపడుతున్న ఉద్యోగులు తమ హక్కుల కోసం 18 రోజులుగా రోడ్డుపై నిరసన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఒకవైపు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వాలు చెబుతుండగా, మరోవైపు అదే వ్యవస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు, భవిష్యత్తుపై భరోసా లేకపోవడం సమంజసం కాదన్నారు. ఏళ్ల తరబడి అనుభవం సంపాదించి, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విజయవంతంలో భాగస్వాములైన ఉద్యోగుల సేవలను గుర్తించి తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఎన్హెచ్ఎం ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన సంక్షేమ ప్రయోజనాలు అందించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. సమస్యలను కాలయాపన చేయకుండా ఉద్యోగ సంఘాలతో చర్చించి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. ఉద్యోగుల పోరాటం కేవలం వేతనాలు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశమే కాదని, ప్రజారోగ్య వ్యవస్థలో సేవలందిస్తున్న కార్మికుల గౌరవం, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య బద్ధంగా చేపట్టే పోరాటాలకు న్యాయవాదులుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో బహుజన న్యాయవాదుల ఫోరం స్టేట్ కన్వీనర్ గంధం శివ, సీనియర్ న్యాయవాదులు పరమల్ల కృష్ణస్వామి, వలీవుల్లా ఖాద్రి, మేడ రంజిత్ కుమార్, రమేష్, నేతావత్ రాము నాయక్, భవాని శంకర్, ప్రభాకర్, కుమారస్వామి, అడప రాజు, తూర్పాటి బాలరాజు, సదానందం, ప్రవీణ్ కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ అండ

**ఆపదలో ఉంటే 1098కు ఫోన్ చేయాలి.. ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు**

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి కందుకూరి పూజ**

**హనుమకొండ,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు, వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు విద్యార్థులు భయపడకుండా సంబంధిత అధికారులను ఆశ్రయించాలని, ప్రతి బాలుడికి చట్టపరమైన రక్షణతో పాటు ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే 'బాల సురక్ష అభియాన్' ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ప్రత్యేక చట్టపరమైన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి రెండో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం.పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాలల హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కందుకూరి పూజ మాట్లాడుతూ.. చాలా మంది విద్యార్థులకు తమకు ఉన్న హక్కులు, సమస్యలు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలనే విషయాలపై సరైన అవగాహన ఉండటం లేదన్నారు. బాలలపై జరిగే వేధింపులు, అన్యాయాలను గుర్తించి వాటిని సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకెళ్లే ధైర్యం విద్యార్థుల్లో పెంపొందించాలని అన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా సహాయం పొందవచ్చని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కూడా సంప్రదించవచ్చని వివరించారు. పాఠశాలల్లో, నివాస ప్రాంతాల్లో బాలలకు సంబంధించిన సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. న్యాయమూర్తి ఎం.పద్మజ మాట్లాడుతూ.. బాలల భద్రత కోసం భారత న్యాయవ్యవస్థ పలు చట్టాలను రూపొందించిందని, ముఖ్యంగా పోక్సో చట్టం బాలలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అన్యాయాల పట్ల మౌనంగా ఉండకూడదని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సెల్‌ఫోన్లకు అతిగా అలవాటు పడకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.సురేష్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవడం వల్ల సైబర్ నేరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చట్టాలపై అవగాహన, క్రమశిక్షణ, నైతిక విలువలు విద్యార్థుల జీవితానికి పునాదులని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు న్యాయమూర్తులతో ముఖాముఖిగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బాలల హక్కులు, భద్రత, సైబర్ నేరాలు, చట్టపరమైన సహాయం వంటి అంశాలపై జరిగిన ఈ అవగాహన సదస్సు విద్యార్థుల్లో ధైర్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎన్. వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్ అనుపమ, ప్రిన్సిపాల్ జై, వైస్ ప్రిన్సిపాల్, విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష.. రూ.1,500 జరిమానా

**పరకాల, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి ఆరు నెలల కారాగార శిక్షతో పాటు రూ. 1,500 జరిమానా విధిస్తూ పరకాల కోర్టు తీర్పు వెల్లడించింది.క్రైం నంబర్ 101/2015, సీసీ నంబర్ 202/2015లో ఐపీసీ 304(ఎ) సెక్షన్ కింద నమోదైన కేసులో నిందితుడు డోరికా కృష్ణారావుపై నేరం రుజువు కావడంతో గౌరవ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జి. సాయిశరత్ ఈ తీర్పు వెలువరించారు.ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్రరు రుధిర సమర్థవంతంగా వాదనలు వినిపించారు. అప్పటి దర్యాప్తు అధికారి ఎస్ఐ దీపక్ కేసును దర్యాప్తు చేయగా, ఇన్‌స్పెక్టర్ అడ్డూరి ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు సారంగపాణి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరించారు.పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, కోర్టులో సాక్షుల ప్రవేశపెట్టడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో నిందితుడికి శిక్ష ఖరారైంది.

# డాక్టర్ సురేందర్‌నాథ్‌రెడ్డి సేవలు అభినందనీయం

**● వైద్య నిర్ధారణ రంగంలో 45 ఏళ్ల ప్రస్థానం..**

**ఘనంగా 77వ జన్మదిన వేడుకలు**

**హైదరాబాద్, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):**వైద్య నిర్ధారణ రంగంలో 45 ఏళ్లుగా డాక్టర్ సురేందర్‌నాథ్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆయన 77వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. 1981లో ఒక్క కేంద్రంతో ప్రారంభమైన విజయ డయాగ్నోస్టిక్స్ నేడు ఏడు రాష్ట్రాల్లోని 30 నగరాలకు విస్తరించి, సుమారు 170 కేంద్రాల ద్వారా ఏటా కోటి మందికి పైగా సేవలందిస్తోందని పేర్కొన్నారు. నాణ్యత, కచ్చితత్వంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆయన కృషిని ప్రశంసించారు.ఉద్యోగులకు సంస్థలో వాటాలు కల్పించడం, వైద్య నిపుణులను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడం, బాలికల విద్య, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించడం వంటి సామాజిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిప్రసాద్‌రెడ్డి, ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సదాశివునిపాలెంలో రీసర్వే పనుల పరిశీలన

**● సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ● నిర్ణీత గడువులోగా భూ రీసర్వే పూర్తి చేయాలి ● 300 ఎకరాల్లో రీసర్వే పూర్తి.. మిగిలిన పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**సత్తుపల్లి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే (రీసర్వే) పనులను శుక్రవారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు, భూ సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దులను కచ్చితంగా నిర్ధారించడం, భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించడం, భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా చూడటమే రీసర్వే ప్రధాన ఉద్దేశమని సబ్ కలెక్టర్ రైతులకు వివరించారు. రీసర్వే ప్రక్రియలో రైతులందరూ భాగస్వాములై సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో రీసర్వే పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో మొత్తం 1,163.16 ఎకరాల విస్తీర్ణం ఉండగా, ఇందులో 120.28 ఎకరాల శిఖం భూములు, 180 ఎకరాల పట్టా భూములు కలిపి ఇప్పటివరకు మొత్తం 300 ఎకరాల్లో రీసర్వే పూర్తయింది.మిగిలిన భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, కచ్చితత్వంతో సర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు.

# విదేశాల్లో నర్సింగ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత

● నర్సింగ్ విద్యార్థినులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి

**సత్తుపల్లి, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** విదేశాల్లో నర్సింగ్ వృత్తికి ఎంతో డిమాండ్ ఉందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్మనీ వంటి దేశాల్లో నర్సింగ్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థినులకు జర్మన్ భాషలో శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సత్తుపల్లి నర్సింగ్ కళాశాలను రూ.19 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని, అవసరమైన అధ్యాపకులను కూడా నియమిస్తామని వెల్లడించారు. విద్యార్థినులు నర్సింగ్ వృత్తిలో నైపుణ్యం సాధించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా, కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వమే మహోన్నతం

- ఆపదలో ఉన్న జర్నలిస్టుకు భరోసా
- సమాజ హితమే లక్ష్యంగా పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు
- సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి
- వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో, తోటి మనుషుల కష్టాలను గుర్తించి ఆపదలో ఆదుకోవడం గొప్ప మానవత్వం. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్న పరిష సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన విశాల దృక్పథాన్ని చాటుకుంది. అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జర్నలిస్ట్ శ్రీనివాసరావుకు భరోసానిస్తూ, ఆర్థిక సహాయాన్ని అందించింది. మానవత్వంతో చేసే చిన్న సహాయం కూడా ఒకరి జీవితంలో గొప్ప మార్పును తీసుకురాగలదని పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక కృషి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు చేతుల మీదుగా జర్నలిస్ట్ శ్రీనివాసరావుకు రూ. 15 వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టులు అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న సమయంలో ట్రస్ట్ ముందుకు వచ్చి చేయూతనివ్వడం ఎంతో అభినందనీయమన్నారు. కేవలం జర్నలిస్టుల సంక్షేమమే కాకుండా, ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత విద్యకు తోడుగా నిలుస్తూ పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడుపుతూ, అకస్మాత్తుగా ఎదురయ్యే ఆర్థిక భారంతో అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేవారికి ఇలాంటి సంస్థలు అండగా నిలవడం గొప్ప మానవతా దృక్పథానికి నిదర్శనమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆపద సమయంలో చేయి అందించే దాతృత్వం కలిగిన హృదయాలను సమాజం ఎప్పుడూ గౌరవిస్తుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎస్‌జీపీఏటీ జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ఎస్‌జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఎస్‌జీపీఏటీ జిల్లా నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, ఊడుగు వెంకటేశ్వర్లు, కనపర్తి నాగప్రసాద్, ప్రసాదరావు, వీరభద్రరావు, వాలి సురేష్ బాబు, శ్యామసుందర్, హరినాథ్ బాబు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వీహెచ్ చేపట్టిన వరుణ యాగంతోనే తెలంగాణలో వర్షాలు

**హైదరాబాద్, అక్టోబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** అంబర్‌పేట్ శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు ఇటీవల మూడు రోజుల పాటు చేపట్టిన వరుణ యాగంతోనే తెలంగాణలో వర్షాలు పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో శ్రీ వనదుర్గ మహా రుద్ర యాగం, వరుణ యాగం నిర్వహించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి కొరత తీరాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని వరుణ దేవుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతన్నలు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో వరుణ యాగం చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో మూడు రోజుల పాటు నిర్వహించిన యాగాలు విజయవంతమై వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు.

# సేక్రెడ్ హార్ట్ పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ

350 మంది విద్యార్థులతో రెండు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ.. మత్తు పదార్థాల నిర్మూలనకు విద్యార్థుల పిలుపు

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా జైలర్ అజ్మీరా సాక్రు నాయక్

**ఖమ్మం, ప్రతినిధి అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** మత్తు పదార్థాల మహమ్మారిని సమాజం నుంచి పూర్తిస్థాయిలో నిర్మూలించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో ఖమ్మం జిల్లా దానవాయిగూడెంలోని సేక్రెడ్ హార్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫాదర్, సిస్టర్స్, పీఈటీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దానవాయిగూడెం నుంచి రామన్నపేట గ్రామం వరకు సుమారు రెండు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా జైలర్ అజ్మీరా సాక్రు నాయక్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, సమాజ అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చిన్న వయసు నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత కనబరచాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం

విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథి అజ్మీరా సాక్రు నాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించింది. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ తిపెట్టి, ప్రధానోపాధ్యాయులు, సిస్టర్ స్టెఫీ, సిస్టర్ జుట్టీ, సిస్టర్ మంజు, పీఈటీ సుధాకర్, చంద్రకళ, నరసింహ, ఉపాధ్యాయ బృందం సభ్యులు కళ్యాణి,సునీత, అశ్విని ,జ్యోతి మీరాబాయి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

● పోలీసులకు ప్రజాప్రతినిధులు సహకరించాలి:

రూరల్ సీఐ పంజాల సర్వయ్య

**కల్లూరు, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంతో పాటు మండలంలోని 23 గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని కల్లూరు రూరల్ సీఐ పంజాల సర్వయ్య కోరారు. శుక్రవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌లో కల్లూరు ఎస్సై నాగరాజుతో కలిసి మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మండలంలోని 23 గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి గ్రామంలో, కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వాటి నిరంతర పర్యవేక్షణకు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, 20 వార్డుల కౌన్సిలర్లు, 23 గ్రామాల సర్పంచులు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# స్వెటర్ల వ్యాపారులకు అండగా నిలిచిన కార్పొరేటర్ కెపిపి చంద్ర (టింకు)

- ఉన్ని దుస్తుల విక్రయాలకు మేయర్, కమిషనర్‌లతో మాట్లాడి అనుమతి ఇప్పించిన కార్పొరేటర్ టింకు..

**కరీంనగర్ అక్టోబర్ 30(పిసి డబ్ల్యూ న్యూస్):** చలికాలంలో తెలంగాణ అమరవీరుల స్తూపం పక్కన, పాత మున్సిపల్ గెస్ట్ హౌజ్ వద్ద, ఐడిసిసి గోడను ఆనుకొని స్వెటర్లు, టోపీలు, బ్లాంకెట్లు అమ్ముకునే చిన్న తరహా వ్యాపారులకు 37వ డివిజన్ కార్పొరేటర్ కెపిపి చంద్ర (టింకు) అండగా నిలిచారు. 37, 38వ డివిజన్లకు చెందిన జాకీర్ ఖాన్‌తో పాటు పలువురు రిటైల్ ఉన్ని దుస్తుల వ్యాపారులు తమకు క్రయవిక్రయాలు చేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని కార్పొరేటర్ టింకును అభ్యర్థించారు. వ్యాపారులలో అధిక శాతం మంది తమ డివిజన్ల వారే కావడంతో స్పందించిన ఆయన, వెంటనే మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లతో మాట్లాడారు. చలికాలం ముగిసేంత వరకు వ్యాపారులు పాత మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద ఎప్పటిలాగే వ్యాపారం చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. కార్పొరేటర్ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన అధికారులు మున్సిపల్ శాఖ ద్వారా వ్యాపారాలకు అనుమతి మంజూరు చేశారు. కార్పొరేటర్ టింకు మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ నుండి తాము కష్టపడి అనుమతి ఇప్పిస్తే, కొందరు ఎంఐఎం నాయకులు సోషల్ మీడియా వేదికగా తామే ఈ అనుమతులు ఇప్పించామని డబ్బా కొట్టుకోవడం సరికాదన్నారు. ఎంఐఎం నేతలకు, కార్పొరేటర్లకు అబద్ధాలు చెప్పడం అలవాటుగా మారిందని విమర్శించారు. డివిజన్ ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని, ప్రజలు ఎల్లప్పుడూ అభివృద్ధి వైపే నిలుస్తారు తప్ప అసత్య ప్రచారాలను నమ్మరని ఎంఐఎం నాయకులకు హితవు పలికారు. మేయర్, కమిషనర్ కలిసిన వారిలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , పో అప్షన్ సభ్యులు బల్వీర్ సింగ్ , పలువురు మైనార్టీ నేతలు ఉన్నారు.

# కెనరా బ్యాంకులో ఖాతాదారులకు ఇక్కట్లు!

**సెక్యూరిటీ గార్డు తీరుపై ప్రజల ఆగ్రహం.. కనీసం కూర్చునే అవకాశం కూడా లేదా?**

**బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి**

**ఏటూరునాగారం అక్టోబర్ 30 (పి.సి.డబ్ల్యు న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకులో ఖాతాదారులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పనుల నిమిత్తం వచ్చే ఖాతాదారులను సెక్యూరిటీ గార్డు లోపలికి అనుమతించకుండా, కనీసం కూర్చోవడానికి కూడా అవకాశం కల్పించడం లేదని పలువురు వాపోతున్నారు.దూర ప్రాంతాల నుంచి బ్యాంకుకు వచ్చే వృద్ధులు, మహిళలు, రైతులు, కూలీలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కూర్చునేందుకు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ఖాతాదారులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత బ్యాంకు యాజమాన్యంపై ఉందని గుర్తు చేస్తున్నారు.భద్రతా నిబంధనల పేరుతో ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సెక్యూరిటీ సిబ్బంది వ్యవహారశైలిపై పర్యవేక్షణ చేపట్టడంతో పాటు ఖాతాదారులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఛలో ఢిల్లీ.. ఓటు బచావో దేశ్ బచావో

**• కరీంనగర్ నుంచి 40 మందితో బస్సు ప్రారంభం..**

**జెండా ఊపిన డా. అంజన్ కుమార్**

**కరీంనగర్, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):**నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఓటు బచావో దేశ్ బచావో' సభకు కరీంనగర్ నుంచి 40 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సులో బయలుదేరారు. ఈ బస్సును కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డా. వైద్యుల అంజన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న పోరాటానికి కరీంనగర్ కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ అలీ, నాత శ్రీనివాస్, షాబాజ్ ఖాన్, షేక్ అజీముద్దీన్, యాకూబ్ పాషా, ఎం.డి. ఇమ్రాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టభద్రుల గొంతుకగా శాసన మండలిలో బీఆర్ఎస్!

**అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి**

**ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి**

**మంగపేటలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సన్నాహక సమావేశం**

**మంగపేట అక్టోబర్ 30 (పి.సి.డబ్ల్యు న్యూస్):** పట్టభద్రులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు మంగపేట మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైన ఆయుధమని, అర్హులైన ప్రతి డిగ్రీ పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్ రావు మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియను ఉద్యమంలా చేపట్టి, ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి నమోదు చేయించాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులకు అవగాహన కల్పించాలని, ఫారం-18 ద్వారా ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో పోరిక గోవింద నాయక్, తాటి కృష్ణ, తుమ్మ మల్లారెడ్డి, కుడుముల లక్ష్మీనారాయణ, నాగ రమేష్, యూనిస్, కొమరం ధనలక్ష్మి, కాడబోయిన నరేందర్, నూతనకంటి ముకుందం, కుర్బాన్ అలీ, చిట్టి మల్ల సమ్మయ్య, తుక్కాని శ్రీనివాస్, నూనె లింగయ్య తదితరులు, వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జక్కుల సువార్తకు ఘనంగా వీడ్కోలు

**- రిటైర్మెంట్ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ఇక్బాల్ సికిందర్**

**కరీంనగర్, అక్టోబర్ 30(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్‌గా విధులు నిర్వహించిన జక్కుల సువార్త పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇక్రం సికిందర్ పాల్గొని ఆమెకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సుదీర్ఘ సేవా ప్రయాణాన్ని గౌరవంగా గుర్తుచేసుకుంటూ, ప్రజాసేవలో ఆమె అందించిన సేవలను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు భరోసా!

**అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి**

**ఏటూరునాగారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సమీక్షా సమావేశం**



**ఏటూరునాగారం అక్టోబర్ 30 (పి.సి.డబ్ల్యు న్యూస్):** తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నివాసంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, పదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమల అభివృద్ధి, పార్టీ బలోపేతానికి కేటీఆర్ కృషి చేస్తున్నారని కొనియాడారు. రాబోయే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన ప్రతి పట్టభద్రుడు, ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల వారీగా అర్హులను గుర్తించి, ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, కాకులమర్రి ప్రదీప్ రావు, పోరిక గోవింద నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, ఎండీ ఖాజా పాషా, సయ్యద్ సర్దార్ పాషా, కర్రె రవీందర్, తురం పద్మ, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబాబాద్ రైల్వే అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

**- మెగా మెయింటెనెన్స్ డిపో, నాలుగో ప్లాట్‌ఫామ్ ఏర్పాటుకు విజ్ఞప్తి**

**మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ పోరిక బలరాం నాయక్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో కలిసి న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహబూబాబాద్‌లో వందే భారత్ రైళ్లకు సంబంధించిన మెగా మెయింటెనెన్స్ డిపో, వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని, రైల్వే స్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫామ్ నిర్మించాలని కోరారు. అలాగే కేసముద్రం, డోర్నకల్, నెక్కొండ, మణుగూరు ప్రాంతాల్లో రైళ్లకు హాల్టులు కల్పించి, స్టేషన్లలో వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. డిపో ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ఈ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు.

# బాలల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి!

**బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం**

**12 పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు.. జడ్జి చండేశ్వరి**

**ములుగు అక్టోబర్ 30 (పి.సి.డబ్ల్యు న్యూస్):**బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి జడ్జి చండేశ్వరి అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని 12 పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పోక్సో చట్టం-2012పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి చండేశ్వరి మాట్లాడుతూ బాలలపై జరిగే ప్రతి అన్యాయాన్ని సమాజం తీవ్రంగా పరిగణించాలని, ఎక్కడైనా బాలల హక్కులకు భంగం కలిగితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. మాట్లాడే బొమ్మల ద్వారా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. కేజీబీవీ విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ, పోలీస్, శిశు సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు.

# శ్రీనగర్ కాంగ్రెస్ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బానోతు జ్యోతి

**- నూతన కమిటీని ప్రకటించిన మండల మహిళా అధ్యక్షురాలు కుసుమ సునీత**

**మల్లంపల్లి, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ మహిళా కమిటీని మండల మహిళా అధ్యక్షురాలు కుసుమ సునీత ప్రకటించారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా, మండల పార్టీ నాయకుల సూచనల మేరకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా బానోతు జ్యోతి, ఉపాధ్యక్షురాలిగా కామ చంద్రకళ, కార్యదర్శులుగా బిలావత్ వనిత, సరిత, కోశాధికారిగా మొగులగానే రజితను నియమించారు. ఈ సందర్భంగా కుసుమ సునీత మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 73వ రాష్ట్ర మహిళల సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో ముువ్వ విజయ్ బాబుతో ప్రముఖుల ఆత్మీయ భేటీ

● మహిళా క్రీడాకారిణులకు రాష్ట్రస్థాయి పోటీలు గొప్ప ప్రోత్సాహం

**సత్తుపల్లి,అక్టోబర్ 30 (పిసిడబ్ల్యు న్యూస్):**మహిళా క్రీడాకారిణుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, వారి ప్రతిభకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే లక్ష్యంతో సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న 73వ రాష్ట్ర మహిళల సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఈ క్రీడా సంబరాల సందర్భంగా టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరైన మాజీ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వ విజయ్ బాబును పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా చల్లా రామకృష్ణారెడ్డి, వెనిగళ్ల నాగేశ్వరరావు, కరాటే వేణు, దుర్గ, డీఎస్ఎన్ రాజు తదితరులు మువ్వ విజయ్ బాబును కలిసి టోర్నమెంట్ విశేషాలను చర్చించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా క్రీడాకారిణులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.మహిళలు క్రీడారంగంలో మరింతగా రాణించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని, సత్తుపల్లిలో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

## మగ్బుల్ విద్యాబోధన నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శం

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య

- క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలనే ఆయన బలం

- అక్షరాలతో జీవితాలను తీర్చిదిద్దిన అలుపెరుగని గురువుకు ఘన వీడ్కోలు

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యు న్యూస్) :** ఒక గురువు సేవ ఎంత గొప్పదో, ఆయన నేర్పిన విద్యార్థుల జీవితాలే చెబుతాయి. క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలనను ఊపిరిగా చేసుకుని, తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన సయ్యద్ మగ్బుల్ నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ఉద్ఘాటించారు. జగ్యాతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మగ్బుల్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవం శుక్రవారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఎందరో విద్యార్థులకు అక్షరాభ్యాసం నేర్పి, వారిని ఉన్నత చదువుల వైపు నడిపించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఆ గురువుకు వీడ్కోలు పలుకుతూ సభ భావోద్వేగంతో నిండిపోయింది. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ... "విద్యార్థుల విజయంలో తన విజయాన్ని చూసుకునే గురువులు అరుదు. మగ్బుల్ అటువంటి అరుదైన ఉపాధ్యాయుడు. ఆయన నేర్పిన పాఠాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయి" అని కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న సయ్యద్ మగ్బుల్ దంపతులను ఎస్జిపిఏటి జిల్లా శాఖ తరఫున శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఇదే వేదికపై పెన్షనర్ల సమస్యలను కూడా పుల్లయ్య ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలని, పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. జీవితమంతా సమాజ నిర్మాణానికి అంకితమైన ఉద్యోగులకు విశ్రాంత జీవితంలో భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, జిల్లా సహ అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కనపర్తి నాగప్రసాద్, జిల్లా నాయకులు చెరుకూరి వెంకటేశ్వర్లు, వాలి సురేష్ బాబు, మేకల కృష్ణయ్య, దొడ్డా వరప్రసాదరావు, కుమారస్వామి, నాగభూషణం, గోపాలరావు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రామారావు హత్య కేసులో అసలు నిజాలు వెలికితీయాలి

● సీపీని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలి: నున్నా నాగేశ్వరరావు

● బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం: పోతినేని సుదర్శన్‌రావు

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యు న్యూస్):**సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను గుర్తించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ పోలీసుల దర్యాప్తు తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. అసలు నిందితులను కాపాడేలా దర్యాప్తు సాగుతోందని ఆరోపించారు.హత్య వెనుక ఉన్న కారణాలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని, కేసును పక్కదారి పట్టించకుండా సమగ్ర విచారణ జరపాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా, న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు సీపీఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో సైన్స్ ప్రయోగాలు

● పనికిరాని వస్తువులతో అద్భుత ప్రయోగాలు..

కొత్త ఉపాధ్యాయులకు జేవీవీ శిక్షణ

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30 (పీసీడబ్ల్యు న్యూస్):**సైన్స్ బోధనను ప్రయోగాత్మకంగా, విద్యార్థి కేంద్రంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు సూచించారు. 2024 డీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు ఖమ్మంలోని రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో 'లో కాస్ట్.. నో కాస్ట్ పరికరాలతో ప్రయోగాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సీసాలు, కొబ్బరి చిప్పలు, పాత సైకిల్ ట్యూబుల వంటి పనికిరాని వస్తువులతోనే అనేక సైన్స్ ప్రయోగాలు చేయవచ్చున్నారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేసినప్పుడే శాస్త్రీయ ఆలోచన, ఆసక్తి పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం వనరుల వ్యక్తులు గాలి పీడనం, కాంతి వక్రీభవనం, అయస్కాంతం, శబ్ద తరంగాలకు సంబంధించిన ప్రయోగాలను చేసి చూపించారు.కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఆర్. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వి. శాంత, మాధవరావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమేష్, ప్రధాన కార్యదర్శి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ వరంగల్‌లో ఘనంగా జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం 'సంశోధిని26' ప్రారంభం

- 52 కళాశాలల నుంచి 1,707 మంది విద్యార్థుల హాజరు.. రెండు రోజుల పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు

**వరంగల్, అక్టోబర్ 30 (పిసిడబ్ల్యు న్యూస్):** కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం 'సంశోధిని26' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అక్టోబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్, టీసీఎస్ హైదరాబాద్ రీజినల్ హెడ్ రిచర్డ్ కింగ్ చత్రగడ్డ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాథమిక అంశాలపై పట్టు సాధిస్తూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. వినూత్న ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తూ స్టార్టప్‌లు స్థాపించే దిశగా కృషి చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ సమస్యల పరిష్కారానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అవగాహన పెంచుకుంటూ విమర్శనాత్మక, విభిన్న ఆలోచనా విధానాలను అలవర్చుకోవాలని సూచించారు.గౌరవ అతిథి రిచర్డ్ కింగ్ చత్రగడ్డ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం ఎంతో అవసరమన్నారు. ఉద్యోగ సాధనలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు జీవిత నైపుణ్యాలు కీలకమని పేర్కొన్నారు. గెలుపు ఒక్కటే లక్ష్యం కాకుండా నిరంతరం సాధన చేస్తూ కొత్త విషయాలను నేర్చుకోవడం, అభివృద్ధి చెందడం ముఖ్యమని తెలిపారు.కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ 'సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా' అనే థీమ్‌తో సంశోధిని26 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలోని 11 విభాగాల ఆధ్వర్యంలో 12 సాంకేతిక వర్క్‌షాప్‌లు, పేపర్ ప్రజెంటేషన్లు, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇన్నోవిజన్‌తో పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వి. సతీష్ కుమార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, ఏకాగ్రతతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలు, ప్యాకేజీలు పొందవచ్చని తెలిపారు.కిట్స్ వరంగల్ మాజీ రాజ్యసభ సభ్యుడు, చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి తదితరులు సింపోజియం నిర్వహణకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థి సమన్వయకర్తలను అభినందించారు.కార్యక్రమ కన్వీనర్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ ఈ సాంకేతిక సింపోజియంలో 52 కళాశాలల నుంచి 1,707 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు తమ పరిశోధన జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఏడాదికి రూ.45 లక్షల విలువైన పరిశోధనా జర్నల్స్ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిట్స్ యాజమాన్య సభ్యులు ఇ. వెంకట్రామ్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ టి. మధుకర్ రెడ్డి, కో-కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్. సునీల్ ప్రతాప్ రెడ్డి, బి. శశికాంత్, పీఆర్‌ఓ డాక్టర్ డి. ప్రభాకరాచారి, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

## కమలాపూర్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మిక పర్యటన

**కమలాపూర్ అక్టోబర్ 30 (పిసిడబ్ల్యు న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మికంగా పర్యటించారు. కమలాపూర్ మండల కేంద్రంలోని సి హెచ్ సి హాస్పటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పర్యవేక్షించి వైద్యుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రోగులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులను,వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు.వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు సత్వర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.అనంతరం ఎం జె పి బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంట గదులు పరిశీలించి పలు సూచనలు చేశారు.గురుకుల విద్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయ బృందానికి సూచించారు.ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మండలంలోని గూనీ పర్తి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.గ్రామ సర్పంచ్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ముచ్చటించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి లబ్ధిదారులను, అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల తాహ సిల్దార్ ఏం సురేష్ కుమార్, మండల అభివృద్ధి అధికారి గుండె బాబు,గూనిపర్తి గ్రామ సర్పంచ్ బుర్ర రాధిక కరుణాకర్ గౌడ్,ఉప సర్పంచ్,మండల రెవెన్యూ,మండల పరిషత్ అధికారులు,సి హెచ్ సి హాస్పటల్ వైద్య బృందం, సిబ్బంది,ఎం జె పి పాఠశాల ఉపాధ్యాయ బృందం,గూనిపర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో విబిజి రాంజీ పథకం మేట్స్‌కు శిక్షణ

**• ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ సీఈవో పి శేషాద్రి**

**కమలాపూర్ అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి గుండె బాబు అధ్యక్షతన శుక్రవారం విబిజి రాం జీ పథకంలో మేట్స్ కు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా పరిషత్ సీఈవో పి శేషాద్రి (ఇంచార్జ్ జెసి పరిపాలన విభాగం) హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో మాట్లాడుతూ ప్రతి మేట్ తప్పనిసరిగా 40 మంది కూలీలకు 125 రోజులు పని కల్పించే విధంగా, కూలీలకు 308 రూపాయలు వచ్చే విధంగా చేయించాలని అన్నారు. గ్రామ అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉండే పనులను, పనుల నాణ్యత, పని జరిగే చోట సౌకర్యాలు పని చేసే విధానం గురించి కూలీలకు వివరించాలని మేట్స్ కు సూచించారు. వి బి జి రామ్ జి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సహకారంతో పనిచేస్తూ టెక్నికల్ అసిస్టెంట్ సలహాలు సూచనలతో మండల వి బి జి రాం జీ అధికారులకు సహకరించి కూలీలకు పని కల్పిస్తూ గ్రామ అభివృద్ధికి ముందుండాలని జిల్లా పరిషత్ సీఈవో అన్నారు. అనంతరం పనులు జరుగుతున్న చోట మేట్స్ కు రిసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుండె బాబు, ఏపీవో ఎన్ రమేష్, ఈసీ కార్తీక్, టెక్నికల్ అసిస్టెంట్స్ ఈ వెంకట్రాంరెడ్డి, కే మానస, బి శ్రీనివాస్, నాగరాణి, కొమురయ్య, కంప్యూటర్ ఆపరేటర్స్, ప్రవీణ్, కవిత, ఫీల్డ్ అసిస్టెంట్స్ ఏ శ్రీనివాస్, తిరుమల, జయరాజ్, దేవరావ్, పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్స్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి- పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్

**కమలాపూర్ అక్టోబర్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని కమలాపూర్ మండల పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్, పద్మశాలి నాయకులు డిమాండ్ చేశారు. ఆయన విద్యారంగానికి, సామాజిక రంగానికి అందించిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పద్మశాలి సంఘం నాయకులుకోరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆయన సేవలు కేవలం పద్మశాలీ సమాజానికే కాకుండా యావత్ తెలంగాణ సమాజానికి ఉపయోగపడతాయని పలువురు మేధావులు, సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. **లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకంలో సామాజిక సేవ** 1986 లో ఆచార్య గడ్డం భాస్కర్‌కు తన మామగారైన మామిడి లక్ష్మీనారాయణ ద్వారా కొండా లక్ష్మణ్ బాపూజీతో పరిచయం ఏర్పడింది. బాపూజీ మంత్రిగా ఉన్న సమయంలో మామిడి లక్ష్మీనారాయణ ఆయనకు పీఎస్‌గా సేవలందించారు. ఆయన మార్గదర్శకత్వంలో చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై గడ్డం భాస్కర్ రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు 1986 లో తెలుగు అకాడమీ పుస్తకం లో ప్రచురితమయ్యాయి. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశీస్సులతో 1996 నుంచి 2002 వరకు వరంగల్ పోపా అధ్యక్షుడిగా భాస్కర్ బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో పద్మశాలీ సమాజ అభివృద్ధికి, ప్రతిభావంతులైన విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగుల మధ్య అనుసంధానం కల్పించేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సులు, మహిళా సదస్సులు, క్రీడా పోటీలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సమాజానికి సేవలందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ యువజన సంఘం ఉపాధ్యక్షులు తుమ్మ రాజేష్, చే రాల రోహిత్ కుమార్, క్యాషియర్ చెనుమల్ల శ్రీకాంత్, డైరెక్టర్లు గాజుల అరుణ్, చందనాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలి

**ఊళ్లను చెడగొట్టే రాజకీయం చేయొద్దు**

**ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి స్కెచ్**

**సీఎంఓ ఆఫీస్ నుంచి డైరెక్షన్**

**మీడియా సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**

**పులివెందుల అక్టోబర్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను జరపాలని, ఊళ్లను చెడగొట్టే విధంగా రాజకీయం చేయొద్దని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు. ఎన్నికల్లో ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి అని ,ఈ మూడేళ్లల్లో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగగలరా అంటూ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు ఎంత బలహీనుడో రాష్ట్రం మొత్తానికి అర్థమైంది. బీటెక్ రవి ప్రచారం వింతగా, ఆశ్చర్యకరంగా ఉంది. ఏ హామీ నెరవేర్చారని టీడీపీ నేతలు ఓట్లు అడుగుతున్నారనీ వైఎస్సార్‌సీపీ కార్పొరేట్, కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్నారు. ప్రచారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలను ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదు. ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పనికి మాలిన పనుల్ని చంద్రబాబు హయాంలో జరుగుతున్నాయి. ఇలాంటి దాడులు గతంలో ఏనాడూ జరగలేదువేలాది మందిని బయట నుంచి తీసుకొస్తున్నారు. బయట నుంచి వచ్చిన వారికి పోలీసులే సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి స్కెచ్. టీడీపీ నీచ ప్రణాళికలకు కోయ ప్రవీణ్ పూర్తిగా సహకరిస్తున్నాడు. టీడీపీ కుట్రలను ఎస్ఈసీ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లింది. ఫ్యాక్షనిజాన్ని చంద్రబాబు తట్టి లేపుతున్నాడు. చంద్రబాబు.. నీవు చేసే తప్పుడు పనులు చాలా దూరం వెళ్తాయి' అని వైఎస్ అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్లను, ఓటర్లను రాకుండా చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి జమ్మలమడుగు, రాయచోటి, కమలాపురం ,పొద్దుటూరు నుంచి మనుషులను తెచ్చుకుని రుకింగ్ చేయాలని చూస్తున్నారన్నారు ఆరోపించారు. స్వేచ్ఛగా ఓటు వేస్తే 80 శాతం వైసీపీ ఓట్లు వస్తాయని వస్తాయని, పులివెందులలో కూటమి నిర్వహించిన బహిరంగ సభతో ఆ పార్టీ బలహీనత రాష్ట్రవ్యాప్తంగా తెలిసిపోయిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు.

పులివెందుల ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి జనాలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. స్థానికంగా ప్రజల మద్దతు లేని కూటమి నేతలు బయట ప్రాంతాల నుంచి జనాలను తీసుకొచ్చి బలప్రదర్శన చేయడం వారి బలహీనతకు నిదర్శనమని పేర్కొన్నారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని, పార్టీ అభ్యర్థుల బైకులు, వాహనాలను దగ్ధం చేయడంతో పాటు ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. గతంలో చంద్రబాబు స్థానిక ఎన్నికలకు దూరంగా ఉంటామని ప్రకటించిన తర్వాత టీడీపీ నేతలు నామినేషన్లు వేయడానికి ముందుకు రాలేదని, ఇప్పుడు తమకు నామినేషన్లు వేయనివ్వలేదంటూ వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు సైతం నామినేషన్లువేయనివ్వబోమని స్పష్టంగా చెప్పినట్లు ఆరోపించారు. 30 నెలల పాలనలో పులివెందులకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల వద్దకు వెళ్లి తమ ప్రభుత్వం ఫలానా అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని చెప్పుకోలేని పరిస్థితిలో కూటమి నేతలు ఉన్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 500 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీకి 50 సీట్లు మంజూరైనప్పటికీ వాటిని వెనక్కి పంపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆరోపించారు. జగనన్న కాలనీల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ఇప్పుడు అభివృద్ధి చేస్తామని, ఒక్క అవకాశం ఇవ్వాలని ఏ ముఖం పెట్టుకొని అడుగుతున్నారని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను పూర్తి చేయడానికి కూడా ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఖర్చు చేయలేకపోయిందని విమర్శించారు. పులివెందుల మున్సిపాలిటీని దొంగల చేతుల్లో పెట్టకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మతో పాటు 20 వార్డుల్లోని పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధిని, ప్రజల ప్రయోజనాలను కాపాడాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# డంపింగ్ యార్డ్ తరలింపునకు కేంద్రం సహకరించాలి

**• ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఈటల రాజేందర్**

**జవహర్ నగర్ అక్టోబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర నాలుగవ రోజు. అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ పరిసర గ్రామాలు, కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, కాలుష్యం కారణంగా గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ తరలింపు, వ్యర్థాల రీసైక్లింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఆయన కోరారు. నివేదిక అందిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన కేంద్ర నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని ప్రకటించారు. నిధులు సమకూర్చడంలో విఫలమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. డంపింగ్ యార్డ్ సమస్యను రాజకీయాలకు అతీతంగా పరిగణించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# గుజరాత్‌లో జరిగే రాష్ట్రీయ ఏక్తా దివాస్ ఉత్సవ్‌కు బయలుదేరిన హన్మకొండ జిల్లా బృందం

**• జిల్లా టీంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్**

**కమలాపూర్ అక్టోబర్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా కెవాడియా (ఏక్తానగర్)లో జరిగే రాష్ట్రీయ ఏక్తా దివాస్ ఉత్సవ్ కు హన్మకొండ జిల్లా నుండి ప్రభుత్వ జిల్లా యంత్రాంగం ద్వారా పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను ఎంపిక చేసింది, ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ గా ఆరెపల్లీ సుమన్(డిప్యూటీ తహసిల్దార్,(హసనపర్తి) వ్యవహరిస్తున్నారు., కోడిమాల శ్రీనివాసరావు (పూర్వ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్), పబ్బ సతీష్ (సర్పంచ్ కమలాపూర్), ఉత్తమరాజు వికాస్(సమాజ సేవకుడు). ఒంటెల నికితాంజలి(వ్యాపార రంగం), సాయికిరణ్ రాథోడ్ ( విద్యార్థి) రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వీరంతా గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ఏక్తా నగర్ కు ప్రయాణమయ్యారు. వీరంతా శుక్రవారం ఏక్తా నగరు చేరి భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరు అయ్యే ఉత్సవంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారు. అక్టోబర్ 31వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది, తెలంగాణలోని వివిధ రంగాల ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

# హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్ నివారణ

**చిట్యేలి అక్టోబర్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని చిట్యేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ గౌడ్ తెలిపారు. మండల పరిధిలో 14 సంవత్సరాలు నిండి, 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికలందరూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన సూచించారు. చిట్యేలి పట్టణంలోని శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డయ్య నాయుడు పర్యవేక్షణలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ ధనలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ బాషా పాల్గొని బాలికలకు వ్యాక్సిన్ ప్రాధాన్యతను వివరించారు. గర్భాశయ క్యాన్సర్ ముప్పును తగ్గించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని, అర్హత కలిగిన బాలికలు నిర్ణీత వయస్సులోనే టీకా వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని అవగాహన కల్పించారు. చిట్యేలి మండల పరిధిలో 14 సంవత్సరాలు నిండి, 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికల్లో ఇప్పటివరకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోని వారు చిట్యేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీకా వేయించుకోవాలని డాక్టర్ శివప్రసాద్ గౌడ్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన బాలికల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలని సూచించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు, గర్భాశయ క్యాన్సర్ నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు తల్లిదండ్రులు సహకరించాలని వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంట్ రెడ్డయ్య నాయుడు, ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాసులు, హెచ్‌ఈఓ ధనలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ బాషా పాల్గొన్నారు.

## 'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..

# ఆకట్టుకుంటున్న 'ఈతా' ట్రైలర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈతా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన వితాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# పాక్‌లోనూ 'రామాయణ' ఫీవర్..

## రణ్‌బీర్ సినిమా కోసం కరాచీ హిందువుల పూజలు..

భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. దర్శకుడు నితీశ్ తివారీ రూపొందించిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాకుండా, సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తాజాగా పాకిస్థాన్‌లోని కరాచీలో నివసిస్తున్న హిందూ సమాజం ఈ సినిమా విజయం కోసం ప్రత్యేక వేడుకలు నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్థానిక యూట్యూబర్ షేర్ చేసిన ఒక వీడియోలో.. కరాచీలోని హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌ను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, సంప్రదాయ సంగీతం, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కరాచీలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకుని, అక్కడ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించి, చిత్రం ఘన విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పాత్రధారులైన రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల ద్వారా తమ సంతోషాన్ని, సినిమా బృందానికి శుభాకాంక్షలను పంచుకుంటున్నామని వారు తెలిపారు. "పాకిస్థానీ హిందువులమైన మాకు, రామాయణ కేవలం ఒక సినిమా కాదు. దాని కథ, సాంస్కృతిక ప్రాముఖ్యత మా సంప్రదాయాలతో, తరతరాల వారసత్వంతో మమ్మల్ని కలుపుతుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

మరోవైపు, ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రీమియర్ షో తర్వాత 'రామాయణ' సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సినిమా చూసిన పలువురు లెటర్‌బాక్స్‌డ్‌లో తమ రివ్యూలను పంచుకున్నారు. నటీనటుల ప్రదర్శన, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగ సన్నివేశాలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో స్వచ్ఛంగా ఉందని, రావణుడిగా యశ్ నటన సినిమాకే హైలైట్‌గా నిలిచిందని కొనియాడారు. చాలా మంది ప్రేక్షకులు ఈ సినిమాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఇస్తూ, పౌరాణిక గాథను తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్', దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు.

# చక్కనమ్మ చిక్కిందా?

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు

# 9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు.

"ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు

# గొప్ప సందేశాన్నిచ్చే సినిమా

యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్యరాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్రంలో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం, ఆ కోరిక చుట్టూ కథను తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. ఎవరైనా సరే ఎంత పెద్ద కలలైనా కనొచ్చు, వాటిని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు"అని అన్నారు. కమల్ కామరాజ్ మాట్లాడుతూ "కథకు ప్రాధాన్యమున్న చిత్రమిది. అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది"అని తెలియజేశారు. సౌమిత్ మాట్లాడుతూ "డియర్ ఆస్ట్రోనాట్' చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు అందరి పాత్రలతో ప్రయాణం చేస్తారు. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రేయసి సేన్, శరణ్య ప్రదీప్, గీతా భాస్కర్, గడ్డం వీరు, మార్తాండ్ కె వెంకటేష్, కార్తిక్, కృష్ణవేణి, మేఘన పాల్గొన్నారు.